నమస్తే తెలంగాణ
నిజామాబాద్, శనివారం 26 అక్టోబర్ 2024
SATURDAY, OCTOBER 26, 2024

## వైకుంఠధామాన్ని పరిశీలించిన అధికారులు



వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్ యాదవ్, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బీబీపేట్, అక్టోబర్ 25 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో ఉన్న వైకుంఠధామాన్ని అధికారులు పరిశీలించారు. 'వైకుంఠధామానికి వెళ్లేదెలా..' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్‌యాదవ్ మాందాపూర్ గ్రామంలోని వైకుంఠధామాన్ని ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, పంచాయతీ కార్యదర్శి గంగుబాయితో కలిసి పరిశీలించారు. వరి కోతలు పూర్తి కాగానే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులతో కలిసి గ్రామసభ ఏర్పాటు చేసి, వైకుంఠధామానికి వెళ్లేందుకు దారి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఈవో రాజు

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 25 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని డీఈవో రాజు ఉపాధ్యాయులకు సూచించారు. బాన్సువాడ మండలం బోర్లం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. శుక్రవారం సందర్భంగా ఫ్రైడే డ్రై డేను నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ అశోక్ తదితరులు ఉన్నారు.

## సర్వేపై అవగాహన

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 25 : బాన్సువాడలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో చేపట్టబోయే సోషల్ ఎకనామిక్ సెన్సెస్ సర్వేపై సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మల్లికార్జున్, తులా శ్రీనివాస్, మున్సిపల్ ఆర్పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 25 : విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డిలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాశి వనంలో కలెక్టర్ మొక్కను నాటారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులతో గాడ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. కళాశాలలోని కంప్యూటర్, ఫారెస్ట్రీ ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులను సంబంధిత సబ్జెక్ట్‌పై పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో ఉన్న స్క్రాప్‌ను నిబంధనల మేరకు తొలగించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య, హాజరు, బోధన అంశాలపై ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

**ఎల్ఆర్ఎస్ సర్వే పక్కాగా నిర్వహించాలి..**

ఎల్ఆర్ఎస్ సర్వే పక్కాగా వేగవంతం నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో ఉన్న వార్డు నంబర్ ఒకటిలో పలు భూముల ఎల్ఆర్ఎస్ ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా భూములను పరిశీలించాలని సూచించారు. వివరాలను సర్వే యాప్‌లో పొందుపర్చాలని తెలిపారు. ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్దన్, అధ్యాపకులు, మున్సిపల్ కమిషనర్ సుజాత, మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్లు సత్వర చర్యలు తీసుకోవాలి**

ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై తహసీల్దార్లు సత్వర చర్యలు తీసుకోవాలని, నిర్ణీత గడువులోగా ఆయా పనులు పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితర శాఖల అధికారులతో పలు అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ధరణి, రాష్ట్ర, జిల్లా ప్రజావాణి దరఖాస్తులు, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు, భూ సంబంధ కేసులు, భూ సేకరణ, మానవ హక్కులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ కేసుల వివరాలు, ప్రభుత్వ భూముల ప్రొటెక్షన్, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణికి సంబంధించిన అంశాలపై ప్రతిరోజూ రెండు మండలాలతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రజావాణి కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోసం ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ సర్వే పనులను సమీక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు రంగనాథ్ రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కామారెడ్డి, అక్టోబర్ 25 : వడ్ల కొనుగోలులో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల కష్టాన్ని గుర్తించకుండా తరుగు, తేమ పేరుతో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందుల గురి చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

మాచారెడ్డి, అక్టోబర్ 25 : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో మూడు నెలల నుంచి విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామపెద్దలు ట్రాన్స్‌కో-కామారెడ్డి డీఈ కల్యాణచక్రవర్తికి విన్నవించారు. వెంటనే 25 కేవీ డీటీఆర్‌ను గ్రామంలో ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ ఓపెన్ హౌస్

నస్రుల్లాబాద్/బిచ్కుంద, అక్టోబర్ 25 : బీర్కూర్, నస్రుల్లాబాద్ మండల కేంద్రాల్లోని పోలీసు స్టేషన్లలో బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, నస్రుల్లాబాద్ ఏఎస్సై వెంకట్రావ్ శుక్రవారం పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్కూర్ బీసీ గురుకుల ఇంటర్ రెండో సంవత్సరం, నస్రుల్లాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు చట్టాలు, ఆయుధాలు, కేసులు ఏవిధంగా నమోదు చేయాలో వివరించారు. పోలీసుల విధులు, బాధ్యతలపైన అవగాహన కల్పించారు. బిచ్కుందలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్సై మోహన్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై వెంకట్రావ్

## చెరువులో పడి మహిళ మృతి

రాజంపేట్, అక్టోబర్ 25 : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన నీరడి చంద్రవ్వ(56) మతిస్థిమితం కోల్పోయి చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మతిస్థిమితం సరిగాలేక కొండాపూర్ గ్రామ శివారులోని మామిండ్ల చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిందన్నారు. భర్త నీరడి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఇంటర్న్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

భిక్కనూరు, అక్టోబర్ 25 : టీయూ సౌత్ క్యాంపస్ జువాలజీ విభాగంలో మొదటి బ్యాచ్ ముగ్గురు విద్యార్థులు హోల్స్‌లైఫ్ సైన్స్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికయ్యారు. వీసీ యాదగిరిరావు ఆర్డర్ కాపీలను ఎంపికైన విద్యార్థులు సరిత, అవినాశ్, అజయ్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, జువాలజీ హెడ్ ప్రసన్నశ్రీ, ఫ్యాకల్టీ మెంబర్స్ సునీల్, విజయ్, శ్రీకాంత్, కంపెనీ సీఈవో శిశిర్‌కుమార్, రచన, త్రిపాఠి పాల్గొన్నారు.

## మాందాపూర్‌లో జోరుగా లిక్కర్ దందా

### పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

బీబీపేట్, అక్టోబర్ 25 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో లిక్కర్ దందా జోరుగా సాగుతున్నది. నాలుగు బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయించడంతో మందు బాబులు వారికి నచ్చిన బహిరంగ ప్రదేశాల్లో సిట్టింగ్ చేసి సీసాలను అక్కడే పగులగొడుతూ నానా హంగామా చేస్తున్నారు. తొమ్మిది నెలల క్రితం మాందాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు గ్రామంలో లిక్కర్ షాపులు నడిపిస్తున్నారని, వాటిని తొలగించాలని దోమకొండ ఎక్సైజ్ అధికారికి ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్సైజ్ అధికారులు ఈ లిక్కర్ షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై ఆ యువకుడు మళ్లీ ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేస్తే అతని నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టారని వాపోయాడు. ఎక్సైజ్ అధికారుల తీరుపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి బెల్ట్ షాపుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బీబీపేట్, అక్టోబర్ 25 : పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేక అధికారి సతీశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని మాందాపూర్ గ్రామాన్ని శుక్రవారం సందర్శించి గ్రామంలో చేపట్టిన పల్లె ప్రగతి పనులు, పల్లె ప్రకృతివనం, కంపోస్ట్ షెడ్డు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి గంగుబాయికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మాచారెడ్డి, అక్టోబర్ 25 : మండలంలోని ఎల్లంపేట, సోమార్‌పేట, రత్నగిరిపల్లి గ్రామాల్లో ధర్మయుద్ధం కరపత్రాలను ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 28న ఈఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న ధర్మయుద్ధం మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని, సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, కుమార్, దేవరాజు, లక్ష్మీనర్సు, రాములు, శ్రీకాంత్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

భిక్కనూరు, అక్టోబర్ 25: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అనుదీప్ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ తెలిపారు. ఈ నెల 24న నిజామాబాద్ రాజారాం స్టేడియంలో జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అనుదీప్ 50 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అనుదీప్‌ను అభినందించారు.

## భూంపల్లిని సందర్శించిన మండల ప్రత్యేకాధికారి

రామారెడ్డి, అక్టోబర్ 25: సదాశివనగర్ మండలంలోని భూంపల్లి గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి చందర్ నాయక్ శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని పల్లె దవాఖాన, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. వీధుల్లో తిరుగుతూ పరిసరాలు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఏపీఎం రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



అడ్లూర్ ఎల్లారెడ్డిలో నిర్వహిస్తున్న పశువైద్యశిబిరం

రామారెడ్డి/ నాగిరెడ్డిపేట, అక్టోబర్ 25: సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 38 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, పది పశువులకు సాధారణ చికిత్సలు చేయడంతోపాటు పది దూడలకు నట్టల నివారణ వ్యాక్సిన్ వేసినట్లు పశువైద్యాధికారి రాంచంద్రం తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యానాయక్, సొసైటీ చైర్మన్ మర్రి సదాశివారెడ్డి, పశు వైద్య సిబ్బంది ఆలియా, ఇస్మాయిల్, సాయికుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని అక్కంపల్లి, ఆత్మకూర్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యాధికారి రవికుమార్ తెలిపారు. రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 322 పశువులకు టీకాలు వేశామన్నారు.కార్యక్రమంలో సహాయ పశువైద్యాధికారి దివ్యశ్రీ, సిబ్బంది అరుణ్, గౌస్, జయరాజ్, గంగారాం, పరంధాములు, రైతులు పాల్గొన్నారు.

# రైతులు ధాన్యం తడవకుండా చూసుకోవాలి

### రైతులకు డీఆర్డీవో సురేందర్ సూచన

లింగంపేట,అక్టోబర్25: వర్షం కురిసిన సమయంలో ధాన్యం తడవకుండా రైతులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో సురేందర్ సూచించారు. ఆయన మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. తూకం ప్రారంభమయ్యే వరకు వర్షం కురుస్తే ధాన్యం తడవకుండా చూసుకోవాలని సూచించారు. నీరు వెళ్లడానికి ధాన్యం రాసుల చుట్టూ కాల్వలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రం సమీపంలో ఉన్న వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. కంపోస్ట్ షెడ్డులో సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో పర్యటించారు. మూడు నెలల క్రితం నీటి పారుదల శాఖ కాలువ మరమ్మతు పనులు ప్రారంభించి, అర్ధాంతరంగా నిలిపివేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపీఎం చామంతి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, సీఈవో పెంటయ్య, పలువురు రైతులు ఉన్నారు.



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో సురేందర్

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 25: మండలంలోని ఆజామాబాద్ గ్రామంలో గురువారం రాత్రి విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై బొజ్జ మహేశ్ శుక్రవారం తెలిపారు. ఆజామాబాద్ గ్రామానికి పంట కోయడానికి హార్వెస్టర్ మిషన్‌తోపాటు హెల్పర్‌గా కర్ణాటక నుంచి యువరాజ్ నాలుగు రోజుల క్రితం వచ్చాడు. గురువారం గ్రామానికి చెందిన తౌర్యానాయక్ రైతు పొలంలో వరి కోస్తుండగా.. యువరాజ్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## యాచారం తండాలో మరొకరు..

రామారెడ్డి, అక్టోబర్ 25: సదాశివనగర్ మండలం యాచారంతండాలో విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోత్ అనిల్(23) గురువారం రాత్రి మంచంపై నిద్రిస్తున్నాడు. కాలుకు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పాముకాటుతో ఇంటర్ విద్యార్థి..



కృష్ణ (ఫైల్)

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 25: మండల కేంద్రం గోపాల్‌పేటకు చెందిన పోసన్నగారి కృష్ణ(17) అనే విద్యార్థి పాముకాటుతో శుక్రవారం మృతి చెందాడు. శ్యాంరావు చిన్న కుమారుడు కృష్ణ గురువారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి పడుకున్నాడు. అర్ధరాత్రి కాలు మండుతుండడంతో పాము కాటు వేసినట్లు గుర్తించిన కుటుంబీకులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, ఇంజెక్షన్ చేయించారు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అతడు స్థానిక సిద్ధార్థ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కృష్ణ మృతికి సంతాపసూచకంగా విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కాలేజీకి బంద్ ప్రకటించారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

లింగంపేట(తాడ్వాయి), అక్టోబర్ 25: తాడ్వాయి మండలం కాలోజివాడి గ్రామానికి చెందిన మల్లమారి గణేశ్ (32) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కూలీ పనులు చేసుకొని జీవించే గణేశ్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని అన్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి బయల్దేరి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. మృతుని తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తుమన్నారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

## ప్రైవేటు స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

రామారెడ్డి, అక్టోబర్ 25: సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి ఎక్స్ రోడ్డులో ఉన్న స్ప్రింగ్స్‌ఫీల్డ్ ప్రైవేటు స్కూల్ బస్సు, లారీ ఢీకొని విద్యార్థికి గాయాలయ్యాయని ఎస్సై రంజిత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్ బస్సు శుక్రవారం సాయంత్రం విద్యార్థులతో వెళ్తున్న క్రమంలో లింగంపల్లి గ్రామ శివారులో గాంధారి నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో బస్సులో ఉన్న ఓ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. స్కూల్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## తాగునీటికి క్లోరినేషన్ పరీక్షలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 25: మండలంలోని రుద్రారం గ్రామంలో తాగునీటికి శుక్రవారం క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో ప్రకాశ్ మాట్లాడుతూ.. నీటిద్వారా వచ్చే వ్యాధులను ఎదుర్కోవడానికి క్లోరినేషన్ పరీక్షలు చేస్తారని చెప్పారు. అనంతరం ఆయన జీపీ కారాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

## ప్లాస్టిక్ సేకరణ కేంద్రం ఏర్పాటు



ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీవో మల్హరి

లింగంపేట, అక్టోబర్ 25: మండలంలోని ముంబాజీపేట గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఎంపీవో మల్హరి శుక్రవారం ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడంతోపాటు ఆరుబయట పారేయకుండా గ్రామంలో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరణ కేంద్రంలోనే వేయాలని సూచించారు. అనంతరం ఆయన జల్దిపల్లి, రాంపూర్, లింగంపేట గ్రామాల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు.

# కొనుగోలు కేంద్రాలను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు



సదాశివనగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### తూకం వేయడం ప్రారంభించకపోవడంపై ఆగ్రహం

రామారెడ్డి, అక్టోబర్ 25: సదాశివనగర్ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వం వారం, పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని, ఇప్పటి వరకు తూకం వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులు వడ్లను కేంద్రానికి తరలించి పది రోజులు గడస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం ఆరబెట్టడం రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు, స్థానిక సింగిల్ విండో చైర్మన్ కమలాకర్‌రావు, సదాశివనగర్ మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాయాగౌడ్, వంకాయల రవి, లింబాద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ ఉత్తర తిరుపతిక్షేత్రం గంగాస్థాన్-II నిజామాబాద్ కళ్యాణ మండపంలో 1) మేనేజర్‌గా Male అర్హత: డిగ్రీ, సాలరీ 15,000/-Month మరియు 2) ఎలక్ట్రీషన్ కం ప్లంబర్ (అర్హత: డిప్లమా ఎలక్ట్రీషన్, సాలరీ 14,000/-Month ఆసక్తిగలవారు. ఆధార్, ఫోటో, స్టడి సర్టిఫికేట్స్‌తో క్రింది అడ్రసుకి సంప్రదించండి. **అనఘా షాపింగ్‌మాల్**, ఆర్.పి.రోడ్, నిజామాబాద్.

NTZ-334492

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గాంధారి, అక్టోబర్ 25: మండలంలోని పేట్ సంగెం, కరక్‌వాడి, పోతంగల్ కలాన్, సీతాయిపల్లి, మేడిపల్లి, గౌరారం, గండివేట్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీడీ మురళీకృష్ణ ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ పరమేశ్, ఏపీఎం గంగారాజు, ఏఎంసీ డైరెక్టర్ సంగని బాబా, సీసీ కాంత్‌రెడ్డి, తాడ్వాయి బాలకిషన్, గణేశ్, సంతోష్‌తోపాటు, పేట్ సంగెం, కాయితి తండా, గుడివెనుక తండా రైతులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 25: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, జంగమాయిపల్లి, రుద్రారం, మల్కాపూర్, మత్తమాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. హెచ్ఎంలు రమేశ్, కాశీనాథ్, రాధిక, విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు స్వాతి, సీఆర్పీ దత్తాత్రి తదితరులు ఉన్నారు.

## చెక్‌పోస్టును సందర్శించిన ఏఎంసీ చైర్‌పర్సన్

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 25: పోచారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత శుక్రవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. రశీదు లేకుండా వాహనాలను పంపించవద్దని సిబ్బంది ప్రభాకర్‌కు సూచించారు. చెక్‌పోస్టులో ఫర్నిచర్ కోసం నిధులను మంజూరు చేశారు. గోపాల్‌పేటలోని మార్కెట్ కమిటీ స్థలంలో 10 దుకాణాల సముదాయం, వేబ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఆమెవెంట ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నాయకులు కిరణ్, నాగిరెడ్డి, యాదగిరిగౌడ్, నారాగౌడ్ తదితరులు ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న చైర్‌పర్సన్ రజిత

## ఆదిలాబాద్ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

రామారెడ్డి, అక్టోబర్ 25: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కారును పద్మాజీవాడి ఎక్స్ రోడ్డు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. ఆయన శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పద్మాజివాడి ఎక్స్‌రోడ్ వద్ద వంతెన నిర్మాణం జరుగుతుండడంతో అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కారు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ముందు సీట్లో కూర్చున్న ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాలేదు. కారు వెనుక భాగం ధ్వంసమైంది.

## ట్రాన్స్‌కో ఏఈఈగా గోపీకృష్ణ

మద్నూర్, అక్టోబర్ 25: మద్నూర్ ట్రాన్స్‌కో ఏఈఈగా గోపీకృష్ణ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. కామారెడ్డిలో కన్‌స్ట్రక్షన్ ఏఈఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై మద్నూర్‌కు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈఈ అరవింద్ కన్‌స్ట్రక్షన్ ఏఈఈగా బాన్సువాడకు బదిలీ అయ్యారు.

## పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

మద్నూర్, అక్టోబర్ 25: పీఆర్టీయూ డోంగ్లీ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కుశాల్ ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా మారుతి, అసోసియేట్ అధ్యక్షుడిగా యాదవ్‌రావు, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, కార్యదర్శిగా సంజీవ్‌కుమార్ ఎన్నికయ్యారు.